# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 16-08-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు ఘనంగా నివాళులర్పించారు.
- ❖ దక్షిణ కొరియా విదేశాంగ మంత్రి చో హ్యున్‌తో చర్చలు ఫలప్రదమయ్యాయని భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్.జైశంకర్ పేర్కొన్నారు.
- ❖ అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్‌ల మధ్య అలాస్కాలో జరిగిన శిఖరాగ్ర సమావేశాన్ని భారతదేశం స్వాగతించింది.
- ❖ కొంకణ్, గోవా, కేరళలోని కొన్ని ప్రాంతాల్లో వచ్చే రెండు రోజులలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది.

========================

శ్రీ కృష్ణ జన్మాష్టమి పర్వదినాన్ని దేశవ్యాప్తంగా ప్రజలు ఈరోజు ఘనంగా జరుపుకున్నారు. జన్మాష్టమి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భగవాన్ శ్రీకృష్ణుడు సమస్త మానవాళికి, సకల జీవుల సంక్షేమానికి అంకితమై, ధర్మానుసారం విధులను నిర్వర్తించే మార్గాన్ని చూపారని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సామాజిక మాధ్యమం ద్వారా తెలిపారు. శ్రీకృష్ణుడు చూపిన మార్గాన్ని అనుసరించి సమాజాన్ని, దేశాన్ని బలోపేతం చేయాలని ఆమె పౌరులకు పిలుపునిచ్చారు. విశ్వాసం, ఆనందం, ఉత్సాహంతో కూడిన జన్మాష్టమి అందరి జీవితంలో కొత్త శక్తిని తీసుకురావాలని కోరుకుంటున్నానని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు.

========================

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్, దక్షిణ కొరియా విదేశాంగ మంత్రి చో హ్యున్‌తో ఈరోజు న్యూఢిల్లీలో ద్వైపాక్షిక చర్చలు నిర్వహించారు. వాణిజ్యం, తయారీ రంగం, సముద్ర వ్యవహారాలు వంటి అంశాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో జరిపిన చర్చలు ఫలప్రదం అయ్యాయని డాక్టర్ జైశంకర్ సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ), స్వచ్ఛ ఇంధనం, రక్షణ రంగాల్లో అవకాశాల గురించి కూడా చర్చలు సాగాయన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతం, ప్రస్తుత అంతర్జాతీయ పరిణామాలపై కూడా

పరస్పరం అభిప్రాయాలు పంచుకున్నట్లు ఆయన వెల్లడించారు. పెహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడిని ఖండించినందుకు జైశంకర్ దక్షిణ కొరియాకు ధన్యవాదాలు తెలియజేశారు.

(వాయిస్ 34 సెకన్లు)

========================

అమెరికా అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షులు వ్లాదిమిర్ పుతిన్‌ల మధ్య అలాస్కాలో జరిగిన శిఖరాగ్ర సమావేశాన్ని భారతదేశం స్వాగతించింది. శాంతి కోసం ఇరు దేశాల నాయకత్వం ప్రదర్శించిన చొరవ అభినందనీయమని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సమావేశంలో సాధించిన పురోగతిని భారత్ ప్రశంసించింది. సమస్యల పరిష్కారానికి చర్చలు, దౌత్య మార్గాలు మాత్రమే సరైనవని విదేశాంగ శాఖ తెలిపింది. ఉక్రెయిన్ సంక్షోభానికి వీలైనంత త్వరగా తెరపడాలని ప్రపంచం కోరుకుంటోందని విదేశాంగ శాఖ తన ప్రకటనలో పేర్కొంది.

========================

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ISS)ను సందర్శించిన తొలి భారతీయుడు, గ్రూప్ కెప్టెన్ శుభాంన్షు శుక్లా తన 18 రోజుల విజయవంతమైన అంతరిక్ష యాత్రను పూర్తి చేసుకుని భారతదేశానికి తిరిగి వస్తున్నారు. అంతరిక్ష మిషన్ అనంతరం పరిశీలన నిమిత్తం అమెరికాలో ఉన్న ఆయన రేపు స్వదేశానికి చేరుకుంటారు. వ్యోమగామి, భారత వైమానిక దళ అధికారి అయిన శుక్లా, అంతరిక్షంలో సూక్ష్మ-గురుత్వాకర్షణ ప్రయోగాలను నిర్వహించిన యాక్సియమ్-4 మిషన్‌కు పైలట్‌గా వ్యవహరించారు. వచ్చే ఏడాది చివరి నాటికి ప్రయోగించనున్న భారతదేశపు తొలి మానవ అంతరిక్ష యాత్ర గగన్‌యాన్ కోసం శుభాంన్షు శుక్లాను ఇదివరకే ఎంపిక చేసిన విషయం తెలిసిందే.

========================

రాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో ప్లుమేరియా గార్డెన్, బనియన్ గ్రోవ్, బబ్లింగ్ బ్రూక్‌లను ఈరోజు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఈ మూడు ప్రాంతాలు ఇకపై అమృత్ ఉద్యాన్‌లో భాగమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పేర్కొన్నారు. ప్లుమేరియా గార్డెన్‌లో గడ్డి దిబ్బలు, ప్రత్యేకమైన మొక్కలు ఉన్నాయి. బనియన్ గ్రోవ్‌లో అటవీ వాతావరణాన్ని తలపించే నిర్మాణాలు, బబ్లింగ్ బ్రూక్‌లో నీటి ప్రవాహాలు, రాతి మెట్లు వంటివి ఏర్పాటు చేశారు. ఈ ఉద్యాన వన సందర్శనకు సెప్టెంబర్ 14వ తేదీ వరకు ప్రజలను అనుమతిస్తారు.

విరామం

========================

దివంగత పూర్వ ప్రధానమంత్రి, భారత రత్న అటల్ బిహారీ వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలోని 'సదైవ్ అటల్' స్మారక మందిరం వద్ద ఈ రోజు ఉదయం పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, కిరణ్ రిజిజు, గజేంద్ర సింగ్ షెకావత్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాతో పాటు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తదితరులు పాల్గొన్నారు.

దేశ సర్వతోముఖాభివృద్ధికి అటల్ బిహారీ వాజ్‌పేయి చూపించిన అంకితభావం, వికసిత్ భారత్ ను నిర్మించేందుకు ప్రతి ఒక్కరినీ ప్రేరేపిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. మూడుసార్లు భారతదేశ ప్రధానమంత్రిగా సేవలు అందించిన అటల్ బిహారీ వాజ్‌పేయి 2018 ఆగస్టు 16న తుదిశ్వాస విడిచారు.

========================

చైనా విదేశాంగ మంత్రి, కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ చైనా పొలిట్‌బ్యూరో సభ్యుడు వాంగ్ యి సోమవారం నుంచి రెండు రోజుల పాటు భారత్‌లో పర్యటించనున్నారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ ఆహ్వానం మేరకు ఆయన భారత పర్యటనకు రానున్నారు. ఈ పర్యటనలో భాగంగా చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యి, అజిత్ దోవల్‌తో కలిసి సరిహద్దు వివాదంపై 24వ విడత ప్రత్యేక ప్రతినిధుల చర్చలు జరపనున్నారు. అలాగే, భారత విదేశాంగ శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ కూడా చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యితో ద్వైపాక్షిక చర్చలు జరపనున్నారు.

==========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపు ఢిల్లీలో 11 వేల కోట్ల రూపాయలతో చేపట్టిన రెండు ప్రధాన జాతీయ రహదారి ప్రాజెక్టులను ప్రారంభించనున్నారు. అనంతరం జరిగే బహిరంగ సభలో ప్రధానమంత్రి ప్రసంగించనున్నారు. ఢిల్లీలో రహదారుల అనుసంధానతను మెరుగుపరచడం, ప్రయాణ సమయం, ట్రాఫిక్ రద్దీని తగ్గించడానికి ద్వారకా ఎక్స్‌ప్రెస్ హైవే, అర్బన్ ఎక్స్‌టెన్షన్ రోడ్-II ప్రాజెక్టులను ప్రభుత్వం చేపట్టింది. ఈ ప్రాజెక్టులు నగర ట్రాఫిక్‌ను తగ్గిస్తూ.. రాజధాని ప్రాంతంలో రవాణాను వేగవంతం చేయనున్నాయి.

==========================

భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ రేపటి నుండి రెండు రోజుల పాటు నేపాల్‌లో పర్యటించనున్నారు. నేపాల్ ప్రధానమంత్రి కె.పి.శర్మ ఓలీ వచ్చే నెలలో భారతదేశానికి రానున్నారు. ఈ పర్యటనకు ముందే నేపాల్ విదేశాంగ కార్యదర్శి అమృత్ బహదూర్ రాయ్ ఆహ్వానం మేరకు విక్రమ్ మిస్రీ నేపాల్ కు వెళ్లనున్నారు. సరిహద్దు భద్రత, విమానయానం, విద్యుత్ రంగం వంటి అంశాలపై సహకారాన్ని మరింత మెరుగుపరచడంపై ఇరు దేశాల విదేశాంగ కార్యదర్శులు ఈ పర్యటనలో భాగంగా చర్చించే అవకాశం ఉంది.

==========================

కొంకణ్, గోవాలోని కొన్ని ప్రాంతాల్లో వచ్చే రెండు రోజులలో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. ముంబై, కొంకణ్, గోవా, దక్షిణ మహారాష్ట్ర, వాటికి ఆనుకొని ఉన్న గుజరాత్ ప్రాంతాలకు ఈరోజు భారీ వర్షాలకు సంబంధించి రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు భారత వాతావరణ శాఖ అధికారి శశికాంత్ మిశ్రా తెలిపారు. అలాగే, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో కూడా ఈరోజు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన చెప్పారు. అలాగే కేరళలోని ఇడుక్కి, ఎర్నాకుళం, త్రిసూర్, కన్నూర్, కాసరగోడ్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేయగా, మిగిలిన అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్టు తెలిపారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఈ నెల 18వ తేదీ వరకు కేరళ, కర్ణాటక, లక్షద్వీప్ తీరాల వెంబడి చేపల వేటను నిషేధించారు.

(వాయిస్ 28 సెకన్లు)

==========================

==========================